నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జనవరి 02, 2025 | www.navatelangana.com

వాహనదారులకు రోడ్ సేఫ్టీపై అవగాహన



రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం వాహనదారులకు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద ఆర్టీవో అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డితో పాటు మోటార్ వాహన తనిఖీ అధికారులు, సహాయక మోటార్ వాహన తనిఖీ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్స్, హెూంగార్డ్స్ పాల్గొన్నారు.

110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

- జిల్లా ఎస్పీ సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మంగళవారం, బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ బుధవారం తెలిపారు. 66 వాహనాలను సీజ్ చేసినట్టు వివరించారు. కామారెడ్డి సబ్ డివిజన్లో 60 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎల్లారెడ్డి సబ్ డివిజన్లో 28 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, బాన్సువాడ సబ్ డివిజన్లో 22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 66 వాహనాలను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఇకపై ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలిపారు. రహదారి భద్రతా నియమ నిబంధనలను పాటించి ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గే విధంగా పోలీసు శాఖ వారు తీసుకునే చర్యలలో ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఆమె ప్రజలను కోరారు.

ఘనంగా న్యూఇయర్

- ఇంటి ముందు ముగ్గులు వేసిన మహిళలు



కామారెడ్డి : ముగ్గులు వేస్తున్న చిన్నారులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో మహిళలు తమ ఇంటి ముందు ముగ్గులు వేశారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ కాలనీలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఇండ్లముందు చిన్నారులు ముగ్గులు వేశారు. కామారెడ్డికి చెందిన ఆకుల సిద్విన, సామల విద్య, ఆద్య ఆధ్వర్యంలో తమ ఇంటి ముందు ఆకట్టుకునే ముగ్గులను వేశారు. నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు.

పొతంగల్ : మండలంలో ఎక్కడ చూసినా ఇంటివాకిళ్లలో రంగు రంగుల ముగ్గులు ఆకర్షించాయి. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు, యువతులు ఇంటి ముందర ఆకర్షించే ముగ్గులను వేసి రంగులతో అలంకరించారు. నూతన సంవత్సరానికి ముగ్గులతో స్వాగతం పలికారు. అలాగే కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని దేవాలయాలు కిక్కిరిసిపోయాయి.



పొతంగల్‌లో..

సమస్యల పాఠశాల

దళిత కాలనీ పాఠశాలలో అన్నీ సమస్యలే.. పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పాఠశాల సమీపంలో గేదెల సంచారం



కూలిపోయిన పాఠశాల ప్రహరీ



వంటగది లేకపోవడంతో ఆరుబయటే పొయ్యి

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రైమరీ స్కూల్ సమస్యలకు నిలయంగా మారింది. దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రహరీ గోడ కూలిపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు వెళ్తున్నప్పటికీ ఈ పాఠశాల స్థితిగతులు పట్టించుకున్న వారు లేరని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేకంగా వంట గదులు లేక కట్టెల పొయ్యిపై ఆరుబయటే వంట చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. తమ కాలనీలో ఉన్న పాఠశాలపై అధికారులు ఏమాత్రం పట్టింపులేదని వెంటనే అధికారులు స్పందించి కొత్త వంట గదిని నిర్మించాలని, ప్రహరీకి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చైతన్యరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీగా చైతన్యరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2021వ బ్యాచ్‌కు చెందిన చైతన్యరెడ్డి.. వరంగల్ ఎన్ఐటీ నుంచి సివిల్ ఇంజినీర్ పట్టా పొందారు. అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించారు. అటు విధులు నిర్వర్తిస్తూనే ఐపీఎస్‌కు ప్రిపేర్ అయ్యి 161వ ర్యాంక్ సాధించారు. ట్రైనీ ఐపీఎస్‌గా ఇటీవల నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఈమెను కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

సీఐలు, ఎస్ఐలతో సమావేశం..

బాధ్యతలు స్వీకరించిన అనంతరం డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలతో ఆమె సమావేశమయ్యారు. పెండింగ్ కేసుల వివరాలు, పోలీస్ అధికారుల పనితీరు, కొత్త ఏడాదిలో చేయాల్సిన పనుల గురించి చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు.



ఏఎస్పీని కలిసిన సీఐలు, ఎస్ఐలు

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- మహా ర్యాలీగా వెళ్లి ఇందిరాగాంధీ విగ్రహానికి వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా మున్సిపల్ ఆఫీస్ వద్ద గల శిబిరం నుంచి ఇందిరాగాంధీ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి మాజీ భారత ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. తమ డిమాండ్లను పరిష్కారం అయ్యే విధంగా రేవంత్‌రెడ్డికి తెలుపాలని ఈ నిరసనను చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు వాసంతి మాట్లాడుతూ.. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, విద్యా బోధన ఆపేసి మహిళలమైన తాము ప్రజా పాలనలో రోడ్లమీదకి ఎక్కి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమ్మె చేస్తున్న సమయంలో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు చనిపోయారని, బుధవారం సిద్దిపేట జిల్లా మహిళా ఉద్యోగి సమ్మెలో హార్ట్ స్ట్రోక్ గురైందని ఆమెకు ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలుపుకుంటారని తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్, రాములు, కాళిదాసు, శైలజ, సంతోష్‌రెడ్డి, వీణ, వనజ, మంగా, శ్రీవాణి, గంగా ప్రసాద్, మాధవి, కళ్యాణ్, సంధ్య, లింగం, కృష్ణ, దినేష్, వీణ, లావణ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇద్దరు మృతి

- చెరువులో స్నానానికి వెళ్లి ఒకరు..
- నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి మరొకరు
- వేర్వేరు చోట్ల ఘటనలు

నవతెలంగాణ-రామారెడ్డి/నిజాంసాగర్

మద్యం మత్తులో చెరువులో దూకి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పొట్టిగారి శివప్రసాద్ (28) అనే యువకుడు డిసెంబర్ 31న స్నేహితులతో కలిసి దావత్‌లో పాల్గొన్నాడు. అధికంగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఒంటిపై మంచి నూనె పోసుకొని, స్నానం చేయడానికి గ్రామ పరిధిలోని పటేల్ చెరువుకు వెళ్లాడు. చెరువు మధ్యలోకి వెళ్లి రాకపోవడంతో తమ్ముడు జగదీశ్వర్ చెరువులోకి దిగి అన్నను బయటకు తెచ్చి అపస్మారక స్థితిలో ఉన్న శివప్రసాద్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే శివప్రసాద్ మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు వేటకు వెళ్లి మృతి..



మృతిచెందిన సాయిలు

నిజాంసాగర్ : చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చేపల వల కాలుకు చుట్టుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మహ్మద్‌నగర్ మండలంలోని కొమ్లంచ గ్రామ శివారులోని మంజీర నదిలో చోటుచేసుకుంది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన విరాల ప్రకారం.. బాన్సువాడ మండలం తిరుమలపూర్ గ్రామానికి చెందిన బెస్త సాయిలు (36) రోజువారీగా చేపలు పట్టేందుకు కొమ్లంచ గ్రామంలోని కొంతమందితో మంజీర నదికి వెళ్లాడు. మంగళవారం చేపలు పట్టే క్రమంలో చేపలు పట్టే వల కాళ్ళకు చుట్టుకుని ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రామిక వర్గాలు రాజకీయంగా బలపడాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు

నవతెలంగాణ-బోధన్

తరతరాలుగా వివక్షకు గురవుతున్న శ్రామిక వర్గాల ప్రజలు రాజకీయంగా బలపడాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన శౌర్యదివస్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో బాబా అంబేద్కర్ ఆనాడు ఎంతో శ్రమించారని, అయినా పాలకుల విధానాలతో నిమ్న జాతి వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందలేదని అన్నారు. దాంతో ఇప్పటికి బలహీన వర్గాల ప్రజలు అన్నింటా వెనుకబడి ఉన్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలు తీరాలన్నా, వారీ జీవితాలు అభివృద్ధి చెందాలన్నా అంబేద్కర్ కల్పించిన ఓటుహక్కుతోనే అది సాధ్యమవుతుందని అన్నారు. కావున తరతరాలుగా వివక్షకు గురవుతున్న అన్ని వర్గాల ప్రజలు రాజకీయంగా బలపడాలని, రాజ్యాధికారం సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యావంతులు బలహీన వర్గాల ప్రజలను చైతన్యం చేయాలని, పాలకులు అమలు చేస్తున్న ద్వంద విధానాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ మనువాద పార్టీల భావాజాలాన్ని వ్యతిరేకించి అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్పూర్తితో ముందుకు సాగాలన్నారు. అలాగే మహాత్మ జ్యోతిబాపూలే, మాన్యశ్రీ కాన్షీరాంల ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బామ్ సేఫ్ రాష్ట్ర నాయకులు, బహుజన విద్యావంతులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

పర్మిషన్ లేకుంటే సీజ్ చేయండి

- ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్స్ ఎక్స్‌రే సెంటర్లను అధికారులు పరిశీలించాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కారదర్శి నూర్జహాన్ డిమాండ్



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్‌లను, ఎక్స్‌రే సెంటర్లను వైద్యాధికారులు పరిశీలించి పర్మిషన్ లేనివాటిని తక్షణమే సీజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కారదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్లను అధికారుల తనిఖీలు చెయ్యడం లేదన్నారు. పర్మిషన్లు లేనందుకే ప్రయివేట్ హాస్పిటల్స్ వైద్యులు రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారిపోయారని ఆరోపించారు. పేద ప్రజలకు జ్వరం వచ్చి దవాఖానాకు పోతే ల్యాబ్‌టెస్టులు, ఎక్స్‌రే, స్కానింగ్‌ల పేర్లతో వేల రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. మహిళలు రోగం వచ్చి స్కానింగ్ కోసం అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు వెళితే కీచకుడు ఆపరేటర్ ప్రశాంత్ కామంతో రహస్యంగా కెమెరాలను బిగించి అశ్లీల దృశ్యాలను చిత్రీకరించి ఫోన్ నెంబర్లను తీసుకొని మహిళల్ని బ్లాక్ మెయిల్ చేయడం సరికాదని, వెంటనే అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ కీచకుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. స్కానింగ్ మేనేజ్మెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను అరెస్టు చేయాలన్నారు. గతంలో బాధితులు సంబంధిత శాఖ అధికారులకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.

సంబంధిత అధికారులు కమిటీల పేర్లతో కాలయాపన చేయకుండా అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, రాధా, బాలాజీ, రఫీక్ కిషన్, సయ్యద్ ఇర్ఫాన్, సయ్యద్ రఫీయేద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గానికి రూ. 5కోట్ల 20 లక్షలు మంజూరు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బాల్కొండ నియోజకవర్గం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలోని మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం ఎన్ఆర్ఇజీఎస్ పథకం ద్వారా బాల్కొండ నియోజకవర్గానికి రూ. 5 కోట్ల 20 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటిలో భీంగల్ మండలానికి 2 కోట్ల 15 లక్షలు, గ్రామాల వారిగా జాగీర్యాల గ్రామానికి 10 లక్షలు, చేంగల్‌కు 20, బడా భీంగల్‌కు 15, రూప్లా, ఎమ్మి తాండకు 10, సికింద్రాబాద్‌కు 10, బెజ్జోరాకు 15, లింగాపూర్‌కు 5, పురానిపేట్‌కు 10, బాబా నగర్‌కు 5, బాబాపూర్‌కు 15, మెండోరాకు 10, దేవనపల్లికి 5, కారేపల్లికి 5, పల్లికొండకు 25, బాచన్‌పల్లికి 10, ముచ్‌కూర్‌కు 20, గోన్‌గొప్పులకు 15, పిప్రీకి 10, మొత్తం రెండు కోట్ల 15 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. నిధులను మంజూరు చేసినందుకు ప్రశాంత్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సోయా కొనుగోలు కేంద్రం నిలిపివేత

- సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కొనసాగుతున్న సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీ నుంచి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్టు సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు బుధవారం తెలిపారు.

3న ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బీసీ మహాసభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన బీసీ మహాసభ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థులు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో బీసి విద్యార్థులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీసీలకు ఇచ్చిన హామీ నేరవేర్చలేదని, బీసీలను మోసం చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై కదం తొక్కడడానికి బీసీ మహాసభను విజయవంతం చేయాలని వారన్నారు. కార్యక్రమంలో సతీష్, హరీష్, సంతోష్, రమేష్, సంగమేష్, దేవేందర్, మధు, పురుషోత్తం, నాగేంద్ర, రాహుల్, సాయి కుమార్, నాగసాయి, రాజేష్, రాకేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల్లోంచి 100 ఫీట్ల రోడ్లు వేయడం దౌర్జన్యం

- ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వ భూమిని తీసుకోరా..?
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి

సామాన్య రైతుల భూములను రోడ్ల పేరుతో ప్రభుత్వం, బడా బాబులు లాక్కోవడం దౌర్జన్యమే అవుతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. పాత కలెక్టర్ కార్యాలయం వెనకాల వేస్తున్న రోడ్డును రైతు సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లింగాపూర్ రోడ్డు మొదలుకుని కలెక్టర్ పాత కలెక్టర్ కార్యాలయం వరకు 100 ఫీట్ల రోడ్డు వేస్తున్నారని, ఈ రోడ్డు వెయ్యాలంటే భూమి అవసరం కాగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన సుమారు 30 నుంచి 40 మంది రైతుల భూములు కోల్పోతున్నారని తెలిపారు. ఈ రోడ్డుకు అవసరమయ్యే స్థలాన్ని చిన్నచిన్న రైతులకు చెందిన 10 గుంటలు, 20 గుంటలు ఉన్న వ్యవసాయ భూమిలో నుంచి సుమారు సగానికి పైగా భూములు రోడ్డుకు పోతున్నాయని వివరించారు. వారిని భయభ్రాంతులకు గురిచేసి వారి భూములను తక్కువ ధరకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, లేదంటే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, భయపడని వారికి ఇతర చోట్ల భూములు ఇస్తామని చెప్తున్నారని బాధితులు తమకు తెలిపారని వివరించారు. దేవునిపల్లి గ్రామానికి చెందిన రాజేందర్‌కు ఈ రోడ్డుకు ఆనుకొని 10 గుంటల భూమి ఉండగా అందులో నుంచి సగానికి పైగా భూమి రోడ్డుకు వెళ్తోందని ఆ రైతు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇలాంటి రైతులు 30 మందికి పైగా ఉన్నారని ఆయన అన్నారు. ఇక్కడ భూములు ఉన్న ఏ ఒక్క రైతుకు కూడా సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే వారి భూములలో నుంచి రోడ్లు వేస్తున్నారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బడా బాబుల వెంచర్ కోసం వాళ్ళ లాభర్జన కోసం రైతులకు సమాచారం లేకుండా వంద ఫీట్ల రోడ్లు వేయడం ప్రభుత్వ అధికారులు బడా బాబులకు కొమ్ము కాయడమే తప్ప మరొకటి ఉండదని అన్నారు. వాళ్లకు నష్ట పరిహారం ఇవ్వకుండా బెదిరింపులతో రోడ్లు వేస్తే తెలంగాణ రైతు సంఘం చూస్తూ ఊరుకోదని వాళ్లకు అండంగా నిలుస్తామని అన్నారు. రైతులతో చర్చించకుండా మొండిగా వ్యవహరిస్తే రైతు సంఘాలు రైతులను ఏకంచేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ రోడ్డు విషయంలో ఇంతకుముందే అనేక పోరాటాలు జరిగాయని, వీటిపై పోరాటం చేస్తున్న సమయంలో ఎమ్మెల్యే వచ్చి వారికి మద్దతు తెలిపారని వివరించారు. ఈ రైతుల సహకారంతోనే ఎమ్మెల్యే కూడా గెలిచారన్నారు.



అటవీ శాఖ భూమిని ఎందుకు తీసుకోరు ?

ప్రభుత్వం ప్రభుత్వ అవసరం కోసం దోమకొండ మండలం బిబిపేట మండలం మధ్యలో గల పాల్వంచ మర్రి నుంచి జనగామ మర్రి వరకు వెళ్లే రోడ్డును వెడల్పు చేసే క్రమంలో రైతుల నుంచి భూములను తీసుకొని రోడ్డు వెడల్పు చేశారని, అటవీ శాఖ భూమిలో నుంచి రోడ్డు వెళుతుంది, దాని వెడల్పు కోసం అటవీశాఖ అధికారులు ఒప్పుకోవడం లేదని, దీంతో గత నాలుగైదు సంవత్సరాలుగా రోడ్డు వెడల్పు పనులు అక్కడే ఆగిపోయాయని తెలిపారు. కేవలం 600 మీటర్ల వరకు రోడ్డు వెడల్పు స్థలం అవసరం ఉంటుందని ఆ స్థలం ఇవ్వడానికే అటవీశాఖ అధికారులు ఒప్పుకోవడం లేదని దీంతో రోడ్డు వెడల్పు పనులు ఆగిపోయాయని తద్వారా అక్కడ నుండి వెళ్లి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జిల్లా నాయకులు ప్రకాష్ నాయక్, రాజేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | జనవరి 02, 2025 | www.navatelangana.com

నేడు ఏకసభ్య కమిషన్ రాక

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఈ నెల 2న (గురువారం) ఉదయం 11గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), నిజామాబాద్‌లో ఉపవర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం విచ్చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన వారు హాజరై, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏక సభ్య కమిషన్ కు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై ఏకసభ్య కమిషన్ కు తమ తమ వినతులు అందజేయాలని అన్నారు.

రెజ్లింగ్‌లో మంచిప్ప విద్యార్థికి గోల్డ్ మెడల్

నవతెలంగాణ-మోపాల్



హనుమకొండ జిల్లాలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలలో భాగంగా రెజ్లింగ్ విభాగంలో మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన బదావత్ రోజా అద్భుత ప్రతిభ కనబరిచారు. 46 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని నిజామాబాద్ రెజ్లింగ్ కోచ్ దేవేందర్ బుధవారం తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన రోజాను మంచిప్ప ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన కమ్మరి కాంతారావు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారు. పేద కుటుంబానికి చెందిన ఈయన వడ్రంగి కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నట్టు తెలిసింది. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కొత్త సంవత్సరం వేళ ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు భద్రత పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన అధికారులు

నవతెలంగాణ-మోపాల్

రోడ్డుపైన వెళ్లే సమయంలో వాహనాదారులు, రోడ్డు భద్రత సూచనలను పాటిస్తూ ప్రయాణించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలో గల బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్ పిల్లలకు వాహనాలను ఇచ్చి రోడ్డుపైకి పంపించవద్దని, తల్లిదండ్రులు వాహనాలు నడిపించే సమయంలో ద్విచక్ర వాహనంపై హెల్మెట్‌ని, నాలుగు చక్రాల వాహనాలపై సీట్ బెల్ట్‌ని వినియోగించాలని విద్యార్థులకు సూచనలు చేశారు. రోడ్డుపై నడిచి వెళ్లే సమయంలో ఎడమవైపున నడవాలని తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్, రాహుల్, శ్రీనివాస్, జిల్లా ఐరాడ్ మేనేజర్ వర్మా నిహాంత్, వసతిగృహ సంక్షేమ అధికారి అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



లాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం నూతన సంవత్సరం, వివాహ వార్షికోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి, ఇస్కాన్ గోల్డెన్ టెంపుల్‌లో సతీ సమేతంగా పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ప్రశాంత్ రెడ్డి దంపతులకు దీవెనలు అందించి, ఇస్కాన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలి

- జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన నిజామాబాద్‌కు విచ్చేసిన సందర్భంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్ష నేత రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలతో పాటు ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు.

ఘనంగా మండల అధ్యక్షుని జన్మదిన వేడుకలు



మండల అధ్యక్షున్ని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల స్థాయి నాయకులు కార్యకర్తలు, కలిసి అధ్యక్షునితో కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. నూతన సంవత్సరం, తమ నాయకుని జన్మదినం ఒకే రోజు రావడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ ఒకరికొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చెలిమెల మల్లికార్జున్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అజీజ్, గంగరాజ్యం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని పలు చర్చీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతి చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు అందరికీ అందజేశారు. చర్చిల్లో ప్రత్యేకమైన పాటలు పాడి అనంతరం కేక్ కట్ చేయడం జరిగిందని చర్చిల పాస్టర్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్రాన్ పల్లి మాజీ ఎంపిటిసి నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, మాజీ మండల కో ఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నట భోజన్న, చర్చి పాస్టర్ ప్రకాష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లి వచ్చి క్రైమ్ రేట్ పెరిగిందని చెప్పడమేంటి?

- అభివృద్ధి చేసి చూపిస్తాం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



జైలుకుపోయి వచ్చిన నాయకులు క్రైమ్ రేట్ పెరిగిందని మీడియా సమావేశం పెట్టి చెబుతున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వెల్ఫేర్ వర్గాల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక మహిళ అయి ఉండి లిక్కర్ వ్యాపారం చేసి అందరిని తాగుబోతులుగా మార్చి క్రైమ్ రేట్ పెంచింది ఎవరని ప్రశ్నించారు. మేము గాలి మాటలు మాట్లాడమని, అభివృద్ధి మాత్రమే చేసి చూపిస్తామని పేర్కొన్నారు. నిధులు తీసుకోవచ్చాం అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. నిజామాబాద్ ప్రజలందరికీ తెలుసు గుట్కా దందా చేసేవారు ఎవరో, ఇసుక దందా చేసేవారెవరో, అక్రమ బియ్యం వ్యాపారం చేసేవారు ఏ పార్టీ వారో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు.

నిజామాబాద్ పట్టణ అభివృద్ధికి టియుఎఫ్ఐడిసి నిధులు 60 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి మంజూరు చేయించానని తెలిపారు. పట్టణంలోని దాదాపు అన్ని డివిజన్లకు డ్రైయిన్, సీసీ రోడ్లు, కల్వర్టులు, పట్టణ అభివృద్ధి కోసం టియు ఎఫ్ఐడిసి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. మాటలతో అభివృద్ధి చేయను.. చేతలతో అభివృద్ధి చేసి చూపిస్తా అని ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్రంలో సంవత్సర కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఇంకో 50వేల ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బిజెపి నాయకులు మాటలు చెబుతారు గాని అభివృద్ధి చేయరని, ప్రధాని నరేంద్ర మోడీ సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఎన్ని ఇచ్చాడు.. ప్రతి ఖాతాలో 15 లక్షలు నల్లధనం వేస్తానని ఎంతమందికి వేశాడు. దేశాన్ని దోపిడీ చేసి పారిపోయిన ఎగవేత దారులను తిరిగి రప్పిస్తానని ఎంతమందిని తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశాన్ని దోచి ఆదాని, అంబానీలకు పెడుతున్నారని, ప్రపంచం మొత్తం అదాని డిఫాల్ట్ ర్ అంటుంటే ఎందుకు నోరు మెదపడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి 8 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ఇప్పుడు రైతులకు రుణమాఫీ కాలేదు అంటూ గగ్గోలు పెడుతున్నారని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 10 సంవత్సరాల్లో రుణమాఫీ ఎంత చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ 21వేల కోట్లు చేసిందని, మిగతా వారికి కూడా చేస్తామని, సంక్రాంతికి రైతు భరోసా కూడా అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను సాంక్షన్ చేసిందని, రాష్ట్రం మొత్తం 25 లక్షల నిరుపేదలకు ఇల్లు అందిస్తున్నామని, దానికోసం 12వేల 500 కోట్లు నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. దానికోసం ప్రత్యేకమైన యాప్‌ను విడుదల చేసిందని, దాంట్లోనే అందరూ అప్లై చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సర్వే కూడా మొదలుపెట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో అన్ని అమలు చేశాం, ఎన్నికల్లో హామీ ఇచ్చిన దానికంటే ఎక్కువగానే అమలు చేశామని అన్నారు.

9న రైతుకూలీ డిమాండ్ డేను జయప్రదం చేయాలి

- అఖిలభారత ఐక్య రైతు సంఘం

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు

ఈనెల 9న రైతు కూలి అశేష ప్రజానిక సమస్యల పరిష్కారానికి డిమాండ్ రోజును జయప్రదం చేయాలని , జిల్లా వ్యవసాయ మార్కెట్ ఖరీద్‌దార్లు, కమిషన్ దారులు సిండికేట్ అవతారమెత్తి పసుపు రైతులను నిండా ముంచుతున్న తీర్మానం రద్దు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దేవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పసుపు బోర్డు సాధన ఉద్యమం నాలుగు దశాబ్దాల కాలం కొనసాగుతా ఉందని, ఒకరిని ఓడించి మరొకరిని గెలిపించిన చరిత్ర పసుపు రైతులకు ఉందని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ పసుపు కొనుగోలుదారులు, కమిషన్ దారులు ప్రతి సంవత్సరం సిండికేట్ అవతారం ఎత్తి కత్రిమంగా ధరలు తగ్గించి రైతులని నిండా ముంచుతున్నారని పదేపదే ఆందోళనలు చేస్తున్న అధికారులు గానీ. అధికార పార్టీ గానీ స్పందించిన పాపను పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 19న ది నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనాని అధ్యక్షతన సమావేశం చేసుకొని రైతుకు ఒకసారి వేలం వేస్తే ధర తగ్గిందని మరోసారి వేలం వేయరాదని కోరడానికి వీలు లేకుండా ఎవరైనా కమిషన్ దారు రైతుకు ఎక్కువ ధర ఇప్పిస్తే సమాచారం చెప్పిన వ్యక్తికి బహుమానం ప్రకటించారని అన్నారు. కమిషన్ దారుకు 5100జరిమానా విధిస్తామని హెచ్చరించారని తెలిపారు. ఈ నిర్ణయం, తీర్మానం భూస్వామ్య రాచరిక పద్ధతిగా అన్నారు. మర్చంట్ అసోసియేషన్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి సిండికేట్ అవతారంపై ఉక్కు పిడికిలి బిగించాలని పోలీస్ యంత్రాంగాన్ని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ నాయకుల్లారా గంజి సేట్ల మెప్పు కోసం చూడకుండా రైతుల బాగుకోసం ఈ తీర్మానంపై గట్టి చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూమిలేని పేదలకు భూములు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలు నిర్ణయించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాని ఒకేసారి 15వేల రూపాయలు రైతు ఖాతాలో వేయాలని అన్నారు. మిగిలిన 50 శాతం రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం పరిధిలో పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలని తెలిపారు. డిమాండ్ రోజుగా జనవరి 9న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేయాలని కోరారు. నిజామాబాద్‌లో జరిగే ఆందోళనలో రైతుల పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సారా సురేష్ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దున మోడీ రాతపూర్వక హామీలు అమలుకై నవంబర్ 26వ తేదీ నుండి ప్రముఖ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల అమరణ నిరాహార దీక్ష చేస్తూ ఆరోగ్యం క్షీణిస్తుందని, అందుగ్గాను రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణాపాయం జరిగితే మోడీ బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు బి కిషన్. ఆకుల గంగారాం, ఇస్తరి రమేష్, గంగాధర్, సాయిలు, గంగాధర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాధవనగర్ దేవాలయం అభివృద్ధికి ఆమడ దూరం

- తగ్గిపోతున్న భక్తులు

నవతెలంగాణ-మోపాల్



నిజామాబాద్ నగర శివారు లోనీ సాయిబాబా దేవాలయం ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రసిద్ధి చెందిన దేవాలయం. ఒకప్పుడు భక్తులతో కిటకిటలాడేది. రాను రాను భక్తుల సంఖ్య తగ్గిపోతుంది. ఆలయ అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. ఒకప్పుడు మాధవ నగర్ హుండీ ఆదాయం 1లక్షన్5వేల నుండి 75వేల రూపాయలకు తగ్గిపోయింది. దీన్నిబట్టి చూస్తే గణనీయంగా భక్తుల సంఖ్య తగ్గిపోయింది. ఇక్కడ నడుస్తున్న రైల్వే బ్రిడ్జి పనులతో వచ్చే భక్తులకు చాలా ఇబ్బందికరంగా మారుతుంది. అది తొందరగా పూర్తయినప్పుడే భక్తుల సంఖ్య పెరుగుతుందని అంటున్నారు. ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో ప్రధాన కారణం కొందరు వ్యక్తులు సాయిబాబాపై తప్పుడు ప్రచారం చేయడం కూడా బాబా ఆలయానికి భక్తుల తాకిడి తగ్గిపోయిందని అనుకుంటున్నారు. ఆలయంలో అంతర్గత సమస్యలు, పూజారుల వ్యవహారాల శైలి ఒకటని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాబా ఆలయంలో కొందరు భక్తుల విషయంలో కూడా తారతమ్యం చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ సిబ్బంది తమ పని తీరు మార్చుకొని అందరిని సమానంగా చూసినప్పుడు ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి కూడా పెరుగుతుందని అంటున్నారు. ఆలయం అభివృద్ధి రోజురోజుకు కుంటుపడుతుంది. పది సంవత్సరాల కాలంలో ఒక్క రూపాయి కూడా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదు. కొందరి భక్తుల చందాల ద్వారా ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ మండపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ ఈవో శ్రీరామ్ రవీందర్ గుప్తా తెలిపారు.

పాలకమండలి లేదు : ఈవో



గతంలో ఆలయానికి పాలకమండలి ఉండేది. కానీ కోర్టులో కేసు ఉండడంవల్ల ధర్మకర్త మండలి ఏర్పాటు చేయడం కుదరదు. కేవలం అభివృద్ధి కమిటీ మాత్రమే ఏర్పాటు చేయాలి. దీనిపై రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి దష్టిని కూడా తీసుకెళ్లాం. ఆలయానికి ఒక చిల్డ్రన్స్ పార్క్, గెస్ట్ హౌస్, టాయిలెట్స్ నిర్మాణానికి సహకరించాలని కోరాం. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. ఆలయంలో అంతర్గత సమస్యల గురించి నవ తెలంగాణ వివరణ కోరగా ఆలయ ప్రాంగణంలో భక్తులందరూ ఒకటే అని, నిరంతరంగా పర్యవేక్షణ చేస్తాను.. భక్తులకు ఇటువంటి ఇబ్బంది కలగకుండా నేను చూస్తాను. భక్తుల తాకిడి పెరగడానికి సాయిబాబాపైన అపనమ్మకాలను పోగొట్టే విధంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికవేత్తలతో ప్రసంగాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవల కాలంలో హైదరాబాద్‌కు చెందిన షిరిడి సాయి విశ్వసమాజ్ వారితో సాయిబాబా ఆలయంలో ఆధ్యాత్మిక సదస్సు కూడా ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో కూడా మరిన్ని ప్రసంగాలు ఏర్పాటుచేసి అపనమ్మకాలు పారదోలే విధంగా చూస్తాం.

ఆలయ ఈవోకు కూడా పని భారం ఎక్కువ అయింది. బోధన్, ఆర్మూర్, కుద్వాన్‌పూర్‌లోని దేవాలయాలకు కూడా రవీందర్ ఈఓగా ఉన్నారు. ఇటీవలనే ఎండోమెంట్ జిల్లా అసిస్టెంట్ సహాయ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.

- సాయిబాబా ఆలయ ఈవో శ్రీరామ్ రవీందర్ గుప్తా

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

- ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్

నవతెలంగాణ-ధర్పల్లి



రాష్ట్ర పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశమని ఆపార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. బుధవారం అయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు నూతన సంవత్సరం పురస్కరించుకొని అందరికి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేద ప్రజలు ఆరోగ్య సమస్యలతో సతమతమై ఆసుపత్రి బిల్లులు కట్టేందుకు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రతినెలా వేల మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్నారని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలుపుతూ గడిచిన సంవత్సర కాలంలో అందరికి సంతోషం కలిగినట్లు ఈయేడు కూడా అందరికి మంచి జరగాలని మండల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెలిమేల మల్లికార్జున్, వైజీఆర్, చెలిమెల శ్రీనివాస్, విడిసి అధ్యక్షుడు గంగరాజ్యం, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అజీజ్, సురేందర్, పోతారాజు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

- పట్టణంలో ఘనంగా భీమ కోరేగావ్ శౌర్య దివస్ వేడుకలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మాలల హక్కుల కోసం నిరంతరం భీమా కోరేగావ్ మహర్ యుద్ధ వీరుల స్ఫూర్తితో పోరాడుదామని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ అంగరి ప్రదీప్ పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలో భీమా కోరేగావ్ 207వ శౌర్య దివస్‌ని పురస్కరించుకుని మాల సంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘం, దళిత ఐక్య సంఘటన, యశోబుద్ధ ఫౌండేషన్, వివిధ దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో వివిధ దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేశారు. అనంతరం భీమా కోరేగావ్‌లో 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో వీరమరణం పొంది అమరులైన మహర్ సైనికుల అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. యశో బుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధ వందన చేసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు ఆర్గుల్ సురేష్, డి.లింగన్న మాల, కొంతం మురళీ, మార్ల ప్రభాకర్, పింజ భూమేశ్వర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ పీష్వాలపై మహర్ రెజిమెంట్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ శౌర్య దివస్ అని అన్నారు. 500మంది మహర్ వీరులు, 28వేల మంది పీష్వా బ్రాహ్మణ సైన్యంతో మహారాష్ట్ర కోరేగావ్‌లో భీమా నది వద్ద భీకర యుద్ధం చేసి విజయం సాధంచారని వివరించారు. మహర్ వీరుల స్ఫూర్తితో మనువాదనికి వ్యతిరేకంగా పోరాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సామాజిక సేవ విభాగంలో గౌరవ డాక్టరేట్ సాధించిన రిటైర్డ్ టీచర్ మాదరి రాజన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మట్టా అమత్ రావు, అబ్దుల్ హుస్సేన్, జిన్నా జనార్దన్, వికాస్ పవర్,కొంతం పూర్ణ, అంబులెన్స్ రాజు,టీం నాయకులు, బుద్దిస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

26వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

- పలు సంఘాల మద్దతు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 26వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నిన్న జరిగిన చర్చల్లో ఆర్థికపరమైన అంశాలపై స్పష్టతనివ్వకపోవడంపై ఉద్యోగులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని అన్నారు. దయచేసి ప్రభుత్వ అధికారులు రెగ్యులరైజేషన్ ప్రాసెస్ ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మెకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉపేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, హరికృష్ణ, మహేష్ రెడ్డి, గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు మరిపెల్లి భూపతి, అశోక్, యుటిఎఫ్ నాయకులు సత్యానంద్, జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఎస్టీటీ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గంగ ప్రసాద్, శ్రీనివాస్, నిజామాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శారద గోనె తదితరులు సంఘీభావం తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ బుధవారం అడ్లూరు ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, సిడిసి చైర్మన్ మహమ్మద్ ఇర్షాదుద్దీన్, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, డైరెక్టర్ లక్ష్మాగౌడ్, బత్తుల రాములు, బక్కన్నగారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ ఆలయంలో బారులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనరసింహుడి దర్శనానికై జనం వివిధ గ్రామాల, పట్టణాల నుంచి ఆలయానికి వచ్చి దర్శించుకున్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని పలువురు వాహన పూజలు చేయించారు. ఓడిబియ్యాలు సమర్పించారు.



ఏఎస్పీని కలిసిన సీఐ సంపత్ కుమార్



ఏఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసిన సీఐ

నవతెలంగాణ-భిక్కనూర్

అడిషనల్ ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన చైతన్యరెడ్డిని సర్కిల్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పి చైతన్య రెడ్డి సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మత్తడి పోచమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆలయ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ గ్రామ సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయాన్నిఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు బుధవారం సందర్శించారు. ఆంగ్ల కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ విరాళాల సేకరించి ఆలయ సమీపంలో పనులు చేపట్టడంతో పనులను పరిశీలించారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పోతగోని శంకర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బుర్ర నారాగౌడ్, ఆకుల సంగయ్య, ఎల్లమ్మయ్య, మారుతి రాజారాం, బాలయ్య, బాలకిషన్, శివయ్య, కౌడ రవి, సత్యం రాజు, నగేష్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

తరచూ కేబుల్ వైర్ల చోరీ

- దుండగులపై నిఘా ఉంచాలంటున్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి, దండిగుట్ట, పోచారం, కళ్యాపూర్ తదితర గ్రామాలలో వ్యవసాయ బోరు బావుల వద్ద గుర్తు తెలియని దుండగులు కేబుల్ వైర్లను దొంగిలిస్తున్నారని దూపల్లి గ్రామ కార్యదర్శి సలాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామ ప్రజలకు మంచి నీటిని అందించే వ్యవసాయ బోర్లకు పలుమార్లు కొత్త కేబుల్ వైర్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని తరచుగా దొంగిలించడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే రైతుల వరి నాట్లు ప్రారంభం కావడంతో కేబుల్ వైర్లు దొంగిలించడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు 10 నుంచి 15 వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు దొంగిలించారని రైతులు అంటున్నారు. రాత్రి సమయంలోనే ఈ దొంగతనాలు జరుగుతున్నందున పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

రాంపల్లి తండాలో భూబండార్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని రాంపల్లి తాండాలో జగదాంబ మాత సంత్ సేవాలాల్ మహారాజ్ మహ బోగ్ బండార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భోగ్‌బండార్ కార్యక్రమానికి ఆల్ ఇండియా బంజారా శక్తిపీఠ్ ప్రధాన కార్యదర్శి బౌరదేవి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎన్ బద్యానాయక్ రాథోడ్, రాంపల్లి తాండా నాయక్ కారోబారి, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

రాజంపేట్ మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన నర్సింలు 2007 సంవత్సరంలో భిక్కనూరు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివాడు. ఇటీవల అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం రూ.18,500 ఆర్థిక సహాయాన్ని నర్సింలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుడుం జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మండల ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు, కుర్నపల్లి మాజీ ఎంపీటీసీ వెంకయ్యగారి రామిరెడ్డి బుధవారం నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల బొకేను అందజేశారు.



అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

9న ధర్నాను విజయవంతం చేయాలి

- అఖిలభారత ఐక్య రైతు సంఘం
- వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్ టౌన్

9న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం పిలుపునిచ్చింది. బుధవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం తరపున పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సాగు భూములకు రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలని, రైతు రుణమాఫీ సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీలో 210 రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు, సన్నకారు, చిన్న మధ్యతరగతి రైతుల రుణమాఫీ చేయాలని సూచించారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు సంవత్సరానికి ఇవ్వాలని పేర్కొన్నారు. 9న జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు అఖిలభారత ఐక్య రైతు సంఘం తరపున ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు పుట్టి నడిపి నాగన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణపై పరిశోధన

- గిరిజన బిడ్డకు పిహెచ్‌డి పట్టా

నవతెలంగాణ-గాంధారి



మండలంలోని లొంక తండా గ్రామ పంచాయతీకి చెందిన శంకర్ నాయక్ గినీబాయ్ దంపతుల మూడవ సంతానమైన సురేందర్ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. లొంక తాండలో పుట్టిన ఆయన తన జాతి మూలాలకు ఆవాసమైన, కొండలు, గుట్టలలో జీవించే వన్య జాతుల సంరక్షణ కోసం ఏదైనా మేలు చెయ్యాలని చిన్నతనంలోనే ప్రతినబూని జంతు వైవిధ్య పరిరక్షణకై అధ్యయనం చెయ్యడానికి నల్గొండ జిల్లాలోని ప్రధాన సమస్యగా ఉన్న మైనింగ్, యురేనియం ప్రతిపాదిత క్షేత్రంలో డాక్టర్ వాసుదేవరావు ప్రిన్సిపాల్ సైంటిస్టు ఆధ్వర్యంలో పరిశోధన జరిపారు. యురేనియం తవ్వకాల ద్వారా వాతావరణంలో ఏర్పడే మార్పువల్ల జీవ వైవిధ్యం, జంతువులకు వాటిల్లే హాని, తద్వారా వాటి ఉనికి కోల్పోయే ప్రమాదం ఉన్నదని గ్రహించి, వాటిని ఏ విధంగా కాపాడాలి, వాటికి కావాల్సిన ఆహారం, ఆవాసం, వాటి ప్రాణాలకు హాని తలపడకుండా పాటించవలసిన జాగ్రత్తలు, సూచనలు తన పరిశోధన ద్వారా తెలియజేశారు. తన అధ్యయనం ద్వారా సమర్పించిన సహేతుకమైన సూచనలు ఆమోదించబడటంతో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ వారు ఆయన పరిశోధనకు గుర్తింపును ఇచ్చారు. గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న సందర్భంగా తన పరిశోధన సమయంలో ప్రొఫెసర్ జితేందర్ నాయక్ జంతుశాస్త్ర అధ్యాపకులు, ఉస్మానియా యూనివర్సిటీ సురేందర్ ప్రతిపాదనను మెచ్చుకుని అభినందించారు. సామాన్య గిరిజన కుటుంబంలో పుట్టి గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి అత్యున్నతమైన పట్టా అందుకుంటున్న సందర్భంగా సురేందర్‌ను పలువురు అభినందించారు. జీవవైవిధ్యం, సంరక్షణ, వాతావరణంలో మార్పు సరైన సూచనలు అనే అంశాలపైన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అంశంలో పరిశోధన చేసి పట్టా అందుకున్న మొదటి వ్యక్తి సురేందర్ కావడం గమనార్హం. ఒకటి నుంచి 5వ తరగతి వరకు గాంధారి ప్రాథమిక పాఠశాలలో చదివిన ఆయన ఆరవ తరగతి నుంచి ఉప్పల్వాయి గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ మాతృశ్రీ కాలేజీలో చదివి డిగ్రీ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డిలో ఫారెస్ట్రీ విభాగంలో పూర్తిచేసి మాస్టర్ డిగ్రీ చెన్నైలోని భారతిధాశన్ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. అనంతరం భారత మంత్రిత్వ శాఖ, అటవీ, వాతావరణ మార్పు విభాగంలో ప్రస్తుతం సీనియర్ సైంటిస్టు అదనపు డైరెక్టర్‌గా నాగపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎంపీ, ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన నాయకులు



ఎంపీ, ప్రభుత్వ సలహాదారుడికి పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్‌ను బుధవారం టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి అన్ని ఎన్నికలలో మంచి విజయాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్యాల సుదర్శన్, పార్టీ సీనియర్ నాయకులు గాల్ రెడ్డి, నరసింహారెడ్డి, అంకం రాజు ఉన్నారు.

మున్నూరు కాపులు అన్ని రంగాలలో రాణించాలి



సన్మానించిన మున్నూరు కాపు సభ్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ మున్నూరు కాపు సంఘంలో బుధవారం విశ్వేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆకుతోట స్వామిని మున్నూరు కాపు సంఘ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్‌గా స్వామిని నియమించిన ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చిన్న బాబును సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండలంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోచారం, ఏఆర్పి క్యాంప్, వడ్డేపల్లి, ఎడపల్లి మండల కేంద్రంలో ఉన్న బెతానియా ఫెలోషిప్ చర్చిలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎడపల్లి పాస్టర్ తిమోతి రాజ్, పాస్టర్ కరుణా కిరాన్, పెంట అశోక్, బుడ్డ రవి, సునీల్, సతీష్, జాన్ పెయింటర్, సూర్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 28మందిపై కేసులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

డిసెంబరు 31 నూతన సంవత్సర వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పట్టణంలోని ప్రధాన కూడల్లలో పికెట్లు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణ చర్యలు చేపట్టామని వివరించారు. తమ పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుని పోలీసులకు సహకరించిన పట్టణ ప్రజలకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనరసయ్య కుటుంబానికి అండగా ఉంటాం



నిత్యావసర సరుకులను అందజేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు

నవతెలంగాణ-ఎడపల్లి

ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మేకపు లక్ష్మి నరసయ్య ఇల్లు దగ్ధమవడంతో సమాచారం తెలుసుకున్న బీజేపీ మండల సీనియర్ నాయకులు కందగట్ల రామ్‌చందర్ బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసయ్యకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని రామచందర్ హామీనిచ్చారు. ఆయన వెంట జానకంపేట తాజా మాజీ ఎంపీటీసీ మంద సంజీవ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, ప్యాట గంగాధర్, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

ప్రభుత్వ సలహాదారు, ఎంపిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శెట్కార్‌ను కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరారు. కామారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



పంచనామ నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్కల్

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందింది. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ వివరాల ప్రకారం.. మధురతండాకు చెందిన జవాన్ పర్యాగ్ బాయ్ (56) అనే వివాహిత తన కొడుకు మోహన్‌తో కలిసి బైక్‌పై డిసెంబర్ 26న జుక్కల్ అంగడి బజార్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో విజయనగర్ కోళ్ల ఫారం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. పర్యాగ్ బాయ్‌కి తీవ్ర గాయాలు కావడంతో 108లో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 31న రాత్రి చనిపోయింది. భర్త చవాన్ నందు ఫిర్యాదు మేరకు పోలీసులు అతివేగంగా బైకు నడిపిన దోసుపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్‌పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాగేపల్లి చర్చి నూతన ఫాస్టేట్‌గా ఆవిర్భావం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి సి.ఎస్.ఐ చర్చి నందు నూతన సంవత్సరం పురస్కరించుకొని పాస్టర్ బి.ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో అన్ని శుభాలు కలగాలని, చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధించాలని పాస్టర్ బి.ప్రశాంత్ కోరారు. ప్రత్యేకంగా నాగపూర్ ఫాస్టేట్ నుంచి బై పార్కేట్ అయినందున బుధవారం బాగేపల్లి సిఎస్ఐ చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి.ప్రశాంత్, కమిటీ సభ్యులు అలిగే అభిషేక్, సిరిగిరి స్వామిదాస్, అలిగే దేవరాజ్, బొక్కెన రాహుల్, అలిగే సంతోష్, అలిగే మోహన్, సిరిగిరి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ విట్టల్‌రెడ్డి కుమారుడు కిషన్ రెడ్డి ఉన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి తాండూర్ త్రిలింగ రామేశ్వర ఆలయం వద్ద నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రసిద్ధిగాంచిన త్రిలింగ రామేశ్వర ఆలయం పేరుపై క్యాలెండర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప సేవా సమితి బియ్యం అందజేత



నవతెలంగాణ-మద్నూర్

భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శబరిమలైలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతల ద్వారా సేకరించిన 34 క్వింటాళ్ల బియ్యాన్ని లారీ ద్వారా పంపించారు. గురు స్వామి రాజు ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సమితి ద్వారా బియ్యం సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ గురుస్వామి, ప్రస్తుత అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను వైభవంగా జరిగినట్టు పాస్టర్ రేవా ఎం.రవీందర్ బుధవారం తెలిపారు. చర్చిలో క్రైస్తవ సోదరులు భక్తి పాటలతో భజన కీర్తనలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పిల్లల వేషాధారణతో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి నవీన్, స్వామి దాస్, స్వామి, మరియమ్మ, సామ్యూల్, దాసు, ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

15వ బూత్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ఉమ్మడి బూర్గుల్ గ్రామపంచాయతీ పరిధిలోని బిజెపి 15వ నంబర్ బూత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ బుధవారం తెలిపారు. అధ్యక్షునిగా కారక్‌వాడి గ్రామానికి చెందిన దొడ్ల భాస్కరరావును, ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి బాబిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ బూత్ అధ్యక్షులు సంతోష్, అశోక్‌రావు, శంకర్, గణేష్, మోహన్, మల్లేష్ యాదవ్, దొడ్ల నవీన్ రావు, జ్ఞానుభాయ్ సంగురావు, భీమరైని శివాజీరావు, సంజీవరావు, గోరుగంటి అశోక్, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షులు



నవతెలంగాణ-కామారెడ్డి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ షబ్బీర్ అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కామారెడ్డి రైస్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకెను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షబ్బీర్ అలీ కుమారుడు, కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఇలియాస్ ఉన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి వెంకీ ప్రతిభ బిఎస్సి నర్సింగ్‌లో సీటు సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ విద్యార్థికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం బుధవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు ధన్యవాదాలు తెలియచేశారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని బోధన్ నిజామాబాద్ రహదారిపై పోలీసులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు చేపడుతు న్నట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపారు. లైసెన్స్ పత్రాలతో పాటు, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించినట్టు చెప్పారు. హెల్మెట్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

కొత్త సంవత్సరం వేళ భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

- చర్చిల్లో ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆయా ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొత్త ఏడాదిలో మంచి జరగాలని కోరుకుంటూ కుటుంబసమేతంగా ఆలయాలకు వెళ్లారు. తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. గుడి ఆవరణంలో కలిసని బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రైస్తవులు చర్చ్‌లలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మొదటి ఆరాధనలో సోదరి సోదరమణులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

నూతన సంవత్సర ఉత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్



కేక్ కట్ చేస్తున్న ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు

పట్టణంలోని ఈఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బాదం రాజ్ కుమార్ ప్రముఖ సీడ్ ఆర్గనైజర్ మారం పల్లి సాయి రెడ్డి, అర్గుల్ సురేష్, లెక్చరర్ ఉప్లూర్ వెంకట్, ఆఫీస్ స్టాఫ్ సౌమ్య, దర్మవీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు తరలిన భక్తులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి పాదయాత్ర ద్వారా భక్తులు బయలుదేరారు. అలాగే పెద్ద తడగూర్ గ్రామం నుంచి అయ్యప్ప స్వాములు శబరిమలైకి బయలుదేరారు.

ఏఐటీయుసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లో బుధవారం సివిల్ సప్లై హమాలి కార్మికులు ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ. జిల్లా నాయకులు ఆరెపల్లి సాయిలు మాట్లాడు తూ.. గతంలో క్వింటాల్ 26 రూపాయలు ఉండగా 2024 సమ్మె ఫలితంగా మూడు రూపాయలు పెంచిన ఇప్పటికీ అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. తక్షణమే పెంచిన రేట్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలానా, శ్రీకాంత్, ఫెరోజ్, రహీమ్, పరశురామ్, బాలయ్య, మతిన్, నదీమ్, కిష్టయ్య మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడవిలోకి ఒంటరిగా వెళ్లకూడదు

- ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి



మాట్లాడుతున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట మండలంలోని సిహెచ్ కొండూర్ అడవి ప్రాంతంలో ఇటీవల పులి సంచరిస్తుందని పలువురు సోషల్ మీడియాలో తెలుపడంతో అటవీ అధికారులు జంతువును గుర్తించడానికి అధునాతనమైన కెమెరాలను బిగించినట్టు తెలిపారు. వాటి కదలికలు కెమెరాలో ఆటోమేటిక్‌గా బంధించడం జరుగుతుందని అన్నారు. అడవిలోకి ఒంటరిగా వెళ్లకూడదని, అడవి జంతువులకు ఎటువంటి ప్రాణహాని చేయరాదని, నందిపేట్ మండల ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ బుధవారం తెలిపారు.

తాహెర్‌బిన్ హందాన్‌కు, అంతిరెడ్డి రాజారెడ్డికి సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ... ఏర్గట్ల విద్యార్థులకు, నిరుద్యోగులకు పోటీ పరీక్షల కోసం గ్రంథాలయం కావాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డిని కోరామని అన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం ఉర్దూ పాఠశాలను పున్ణప్రారంభించాలని, ఖబ్రస్తాన్ గోడ నిర్మాణం కోసం నిధులు కావాలని మైనార్టీ నాయకులు కోరగా ఇరువురు చైర్మన్లు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఏర్గట్ల అభివృద్ధి కోసం నిధులు అడగ్గానే స్పందించిన నాయకులకు ఏర్గట్ల మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, నాయకులు బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, మైనార్టీ నాయకులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బిగాల



కేటీఆర్‌ఎకు పుష్పగుచ్ఛం అందజేసిన బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల బుధవారం మర్యాదపూ ర్వకంగా కలిసారు. ఈసందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన నియోజకవర్గ ఇన్చార్జి

నవతెలంగాణ-ఆర్మూర్



జూబ్లీహిల్స్‌లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి వర్యులు, ప్రస్తుత బోధన్ శాసన సభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్ అర్బన్ అభివృద్ధికి రూ. 60 కోట్లు మంజూరు

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- కవిత ఎంపీగా నిజామాబాద్‌కు చేసిన ఒక్క అభివృద్ధి పని లేదు
- నుడా చైర్మన్ కేశ వేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కేశ వేణు

నిజామాబాద్ అర్బన్ అభివృద్ధికి పియుఎఫ్ఐడీసీ ద్వారా 60 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి అన్ని డివిజన్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు 60 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అమృత్ స్కీం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకోసం 400 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ఆ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలలో దాదాపు 80శాతం హామీలను పూర్తి చేసినట్టు చెప్పారు. కానీ గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత నిజామాబాద్ కు చుట్టపు చూపుగా వచ్చిన కవిత రాష్ట్రంలో నిజామాబాద్ అర్బన్‌లో అభివృద్ధి జరగడం లేదని మాట్లాడుతున్నారని తెలిపారు. గతంలో కవిత ఎంపీగా ఉన్నప్పుడు నిజామాబాద్‌లో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదని, కేవలం ముఖ్యమంత్రి కూతురుగా హెూదాను మాత్రమే అనుభవించిందని, ప్రజల గురించి ఏ రోజు ఆలోచించలేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిజాంసాగర్ ఫ్యాక్టరీ మూత పడిందని ఆ సమయంలో ఎంపీగా ఉన్న కవిత ఏ రోజు మాట్లాడలేదని అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తుందని ఆయన తెలిపారు. అదే విధంగా బిజెపి ఎంపీ అరవింద్ తనకు మోడీతో దగ్గర సంబంధం ఉంది అని చెప్తున్నాడని, నిజామాబాద్ పార్లమెంటులో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా తీసుకురాలేదని, కేవలం ప్రగల్భాలు పలకడానికి అరవింద్ సరిపోతున్నాడని అన్నారు. ఇకనైనా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య శ్రీ పరిమితి 10లక్షల వరకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, దాదాపు 90 రైతులకు 2 లక్షలోపు రుణమాఫీ చేశామని అన్నారు. మరొక్క సారి కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు మాటలు మాట్లాడితే మహిళా కాంగ్రెస్ నాయకులు తరిమి కొడతారని కేశ వేణు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జావేద్ అక్రమ్, కార్పొరేటర్ కుద్దుస్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, కార్పొరేటర్ రోహిత్, బీసీ సెల్ నగర అధ్యక్షులు నాగరాజు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు వినయ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్,లవంగ ప్రమోద్,మహిళా కాంగ్రెస్ నాయకులు పద్మ, అపర్ణ, శుభం, అయ్యూబ్, ఆకుల మహేందర్, సాయి కుమార్, హరూల్ ఖాన్, కుద్దుస్, వాలి తదితరులు పాల్గొన్నారు.

రేట్ల ఒప్పందం జీవో ఇచ్చేవరకు సమ్మె

- సివిల్ సప్లై హమాలీల సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సమ్మెలో పాల్గొన్న సివిల్ సప్లై హమాలీలు

సివిల్ సప్లై హమాలీల సమ్మె జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్ల సమ్మెను ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ.. సివిల్ సప్లైస్ కార్పోరేషన్‌లో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హమాలీలు, స్వీపర్లకు సంబంధించిన రేట్ల ఒప్పందం కార్పొరేషన్ రాష్ట్ర కమిషనర్, సివిల్ సప్లై మినిస్టర్‌తో చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్మికుల గత ఒప్పందం 2023 డిసెంబర్ 31తో ముగిసిందని తెలిపారు. జనవరి 1, 2024తో నూతన ఒప్పందం అమల్లోకి రావాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల యూనియన్ నాయకత్వంతో మాట్లాడకపోవడంతో_ పోరాటాలు చేసిన సందర్భంగా దిగివచ్చిన ప్రభుత్వం అక్టోబర్ 4న రాష్ట్ర కమిషనర్ చౌహన్ నాయకత్వంతో చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. కానీ ఒప్పందానికి సంబంధించిన జీవోను ఇవ్వటంలో నిర్లక్ష్యం చేయటంతో కమిషనర్ సంబంధిత అధికారులను కలిసిన ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేపట్టారన్నారు. ఇప్పటికైనా కమిషనర్, ప్రభుత్వం దిగొచ్చి ఒప్పందం చేసుకున్న జీవోను వెంటనే విడుదల చేసి బకాయి వేతనాలను ఏరియర్స్‌తో సహా 2024 జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీఓ ఇచ్చేంతవరకు కొనసాగుతుందని, ప్రజలకు విద్యార్థులకు కలిగే అసౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనరే బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి.చక్రపాణి, డాటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం నాయకులు పవన్, యూనియన్ నాయకులు దేవేందర్, కైసర్, నాగరాజ్, జావీద్, రాజు, వాజిద్, చంద్రమ్మ, సాయిలు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామంలోని ఎల్-షద్దాయి ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర ప్రార్థనలు బుధవారం ఘనంగా జరిగాయి. దైవ సేవకులు పాస్టర్ శేఖర్ ఇడ్విన్ మాట్లాడుతూ.. ఈ నూతనమైన సంవత్సరంలో అందరూ ఆనందంతో ఉండాలని ప్రార్థన చేశారు. అనంతరం యువకులు నాటికలు డాన్సులతో అలరించారు. ఈ ప్రాంతంలో భాగంగా పాస్టర్ శేఖర్ ఇడ్విన్ 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గోకచిన్ని పతాని సుమన్, చందు, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

సేవల ద్వారానే గుర్తింపు

- పీఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్గం మోహన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందని పీఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్గం మోహన్ అన్నారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కోదండరాం ఇటీవల నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మహసభలో మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్ల ఐక్యత, ప్రజల నుంచి లభించే మద్దతు, ద్వారా ప్రభుత్వం నుంచి గుర్తింపు సాధ్యపడుతుందని తెలిపారు. ఒకరి వల్ల సమాజానికి మంచి జరుగుతుందని ప్రజల్లో ఆలోచన కలిగినప్పుడు ప్రభుత్వం గుర్తింపు కోసం మద్దతు లభిస్తుందన్నారు. మన డిమాండ్‌లను ప్రభుత్వం వింటుందని, గుర్తింపు కోసం పట్టుబట్టటం కాదు.. సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందనే అంశాలను గుర్తుచేశారు. ఒక వ్యూహం ప్రకారం ప్రభుత్వం వద్దకు వెళ్లాలని, వేసే ప్రతి అడుగు బలమైనదిగా ఉండాలనే కోదండరాం సార్ సూచనలు పాటించాలన్నారు. పిఎంపిలు సేవలకు శిక్షణ ఇస్తే మరింత సేవల అందించే వీలుంటుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం కషి చేయాల్సిన అవసరం అందరిపై బాధ్యత ఉందని తెలిపారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవసరం

- ప్రముఖ ఎన్నారై రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నోముల రామచంద్రారెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



యువతకు నైపుణ్యాభివద్ధి శిక్షణ అవసరమని ప్రముఖ ఎన్నారై రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నోముల రామచంద్రారెడ్డి అన్నారు. స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థపై ఉన్న నమ్మకంతో వయో మానసిక దివ్యాంగుల ఉన్నతి కోసం వత్తి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం అందజేసినట్టు ఆయన తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లోగల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను దివ్యాంగ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ప్రముఖ ఎన్నారై నోముల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వయో మానసిక దివ్యాంగుల ఉన్నతి కోసం తన వంతు బాధ్యతగా వత్తి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతుగా లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఈ వత్తి శిక్షణా కేంద్రంతో మానసిక దివ్యాంగులు వారి కాళ్లపై వారు నిలబడగలుగుతారని ఆయన తెలిపారు. అనాథ దివ్యాంగులయినప్పటికీ వారికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుట్టినరోజు వేడుకలు జరపడం సంతోషకరమన్నారు.

కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్. సిద్దయ్య వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, రామ్ నోముల చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జీవన్ దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షల డప్పులు.. వేల గొంతులు.. మహా ప్రదర్శన

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

లక్షల డప్పులు.. వేల గొంతులు.. మహా ప్రదర్శన.. పెద్ద ఎత్తున ప్రపంచమే మాదిగల వైపు చూసే విధంగా కనివిని ఎరుగని రీతిలో హైదరాబాద్ నగరం దద్దరిలేలా నిర్వహిద్దామని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు గత సంవత్సరం ఆగస్టు 1న ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని తీర్పు ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అమలు చేయలేకపోవడంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 3న హైదరాబాదులో లక్షల డప్పులు.. వేల గొంతులు.. మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రపంచమే మాదిగల వైపు చూసే విధంగా కనివిని ఎరుగని రీతిలో హైదరాబాద్ నగరం దద్దరిల్లేలా ప్రదర్శనను నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. జనవరి 10న నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సమావేశానికి మందకృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పద్మశాలి విజయ కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రింట్ మీడియా విలేకరుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా పోల్కం పురుషోత్తం (మనతెలంగాణ), ఉపాధ్యక్షులుగా మేకల శ్రీకాంత్(సూర్య), కార్యదర్శిగా సాజిత్ (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా పసుపుల లింగమూర్తి (జనం సాక్షి), కోశాధికారిగా మాసం రాకేష్‌గౌడ్ (దిశా), గౌరవ సలహాదారులుగా యెనుగందుల శశిధర్ (నవతెలంగాణ), బొడ్డు శంకర్ (సాక్షి), ఎంఏ హఫీజ్ (ఆంధ్రజ్యోతి), సమాచార ప్రతినిధిగా ఎంఏ అమీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను తోటి మిత్రులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పోల్కం పురుషోత్తం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించిన సహచర మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. సమస్యల పరిష్కారంలో తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.